అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలల సమగ్రాభివృద్ధి



పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలలో అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ సీహెచ్ ఇందిర


పెనుగొండ: అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం


పోడూరు: పెనుమదం శివారు అప్పిచెరువులో అంగన్‌వాడీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: బాలల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం చేస్తాయని సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రం పిలుస్తోంది ర్యాలీలో పాల్గొని ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన బాలలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆట, పాటలతో పాటు సృజనాత్మకత కూడిన విద్యను అందించనున్నట్లు ఇందిర చెప్పారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ నుంచి ప్రాథమిక పాఠశాలలో చేరబోయే విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలు అందజేశారు. సర్పంచ్ దిడ్ల మణివజ్రం, ఎంపీటీసీ సభ్యురాలు మేడిది స్వర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ, ఏఎన్‌ఎం కె.సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ టి సుజిత, ఎంఎస్‌కే కె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగపద్మావతి అన్నారు. పెనుమదం శివారు అప్పిచెరువు గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ సీహెచ్.ఇందిర పర్యవేక్షణలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 3 ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. సూపర్‌వైజర్ నాగపద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన ఉంటుందన్నారు. ర్యాలీ అనంతరం ఈ ఏడాది ఒకటో తరగతికి వెళ్తున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జి.వనజ, ఎం.అమ్మాజీ, ఎం.శ్రీపద్మావతి, పి.విస్తోరి, కె.ప్రభావతి, పి.ప్రసన్నకుమారి, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో...

పెనుగొండ: మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ పిలుస్తోందిని విజయవంతం చేయాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ విజ్ఞప్తి చేశారు. శనివారం పెనుగొండ లింగాల వీధిలోని త్యాగరాజ గాన సభలో 5 సంవత్సరాలు నిండి పీపీ1, పీపీ2 అభ్యసించి 1వ తరగతికి ప్రమోటైన చిన్నారులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. వీటిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ ఎం.ఆషారోహిణి, సూపర్‌వైజర్ ఎం.విజయకుమారిలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవిత కేంద్రానికి ఆర్థిక సాయం


పోడూరులో భవిత కేంద్రానికి ఆర్థికసాయం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగి నెక్కంటి అచ్చియ్య

పోడూరు: పోడూరులోని భవిత కేంద్రానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నెక్కంటి అచ్చియ్య రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులకు శనివారం ఆయన ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అచ్చియ్య మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారుల విద్యాబోధనకు, వైకల్యానికి చికిత్స అందించడంలోనూ భవిత కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థులైన చిన్నారుల కోసం తాను ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఉగ్గిరాల చంటి, కోలా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం


క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బ్రాడీపేటకు చెందిన జి.సుబ్రహ్మణ్యం గత కొంతకాలం నుంచి క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా సాగుతోంది. విషయాన్ని తెలుసుకున్న పాలకొల్లు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం రోగికి రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితుడి సుబ్రహ్మణ్యానికి మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సంస్థ సభ్యుడు సిద్దాని సందీప్ రూ.5వేలు, సంస్థ సభ్యులు ఇచ్చిన మొత్తాన్ని కలుపుకుని రూ.15 వేలు సహాయం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దాని బాల శంకర మల్లేశ్వరరావు, బొక్కా గంగాధరరావు, బోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనధికార కట్టడానికి జరిమానా

నరసాపురం: నరసాపురం పట్టణంలో 17వవార్డు పెమ్మినీడి వారివీధిలో అజ్జరపు సీతారామాంజనేయమూర్తి మున్సిపల్ అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేశారని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. దీనిపై 2021లో టౌన్‌ప్లానింగ్ కోర్టును ఆశ్రయించిందని వివరించారు. నరసాపురం అడిషనల్ సివిల్‌జడ్జి కోర్టు అక్రమ నిర్మాణం చేసిన సీతారామాంజనేయమూర్తికి రూ1,78,903లు ఫైన్ విధించిందని చెప్పారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని, పట్టణ వాసులు గమనించాలని చెప్పారు.

ఆటపాటలతో కూడిన విద్య లక్ష్యం


గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులతో ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి

పాలకొల్లు అర్బన్: చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు నడుపుతున్నామని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతరాణి అన్నారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నడుపుతున్నామని, నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రాల్లో లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రీ స్కూల్ నుంచి వర్గోన్నతి చెందిన చిన్నారులకు ప్రత్యేక యూనిఫాం వేసి గ్రాడ్యుయేషన్ డేలో భాగంగా ఉత్తీర్ణతా పత్రాలు అందజేశారు. సర్పంచ్ కవురు భారతి సీడీపీఓ సీహెచ్ ఇందిర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నేత కవురు భాస్కరబాబు పాల్గొన్నారు.

కొబ్బరికాయల దొంగతనంపై కేసు

యలమంచిలి: మండలంలోని కాజ బైపాస్ రోడ్డులోని కొబ్బరికాయల దుకాణంలో ఉన్న రెండు వేల కొబ్బరికాయలను దుండగులు చోరీ చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపులో దొంగతనం చేశారని యజమాని గుబ్బల నెహ్రూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు.

నేడు ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగొండ: ఆచంట మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.నరసింహ ప్రసాద్ శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని పూలపల్లి గ్రామంలో భవనంపై నుంచి పడి వీరాస్వామి హరి (28) అనే కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పూలపల్లి గ్రామంలో సంధ్య మెరైన్స్ రొయ్యల ఫ్యాక్టరీలో నూతన భవనంలో వీరాస్వామి హరి ఫ్లోరింగ్ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో హరి భోజనం చేసి భవనం పైకి పడుకోవడానికి ఎక్కి ప్రమాదవశాత్తూ భవనం చివరకు రావడంతో కింద పడిపోయాడు. స్థానికులు అతడిని గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే వీరాస్వామి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు హరిది తమిళనాడు రాష్ట్రంలోని పులియంగుంట గ్రామం. ఉపాధి కోసం ఇక్కడకు వచ్చాడు. మృతుని తండ్రి చెంగారెడ్డి వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై మార్‌లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవధ చేస్తే కఠిన చర్యలు


నరసాపురంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు


పోడూరులో గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: గోవధ నిషేధ చట్టాన్ని అనుసరించి గోవధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆయన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. గోవధచేసే వారిపై, గోవధ నిమిత్తం గోవులను తరలించే అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. యానిమల్ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం గోవధను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా సోమవారం బక్రీద్ రోజు గోవధలు జరగకుండా పట్టణమంతా నిఘా పెట్టాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. గోవధ చేసినా, రవాణా చేసినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ వై.సుధాకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎవరైనా గోవులను వధిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని స్థానిక వెటర్నరీ ఏడీ డాక్టర్ జాన్సన్ హెచ్చరించారు. గోవధ నిషేధంపై శనివారం పోడూరులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ జాన్సన్ మాట్లాడుతూ గోవధ చట్టరీత్యా నేరమనీ, గోవధకు పాల్పడిన వారిపై, సహకరించినవారిపై కూడా 1962 చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరుని ప్రత్యేక అలంకరణ

మొగల్తూరు: స్థానిక కేతకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే స్వామి వారిని పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కురెళ్ళ రామచంద్రుడు ఆధ్వర్యంలో భక్తులుస్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


పాలకొల్లు అర్బన్: దగ్గులూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న శాగ సత్యనారాయణ


యలమంచిలి: మేడపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దేగల సూర్యప్రభ

పాలకొల్లు అర్బన్: మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేసి చిన్నారులకు వడ్డించాలని మండల పరిషత్ ప్రతిపక్ష నాయకుడు శాగ సత్యనారాయణ కోరారు. మండలంలోని దగ్గులూరు ప్రాథమిక పాఠశాల నెం.1లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని శనివారం ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎక్కువ మందిని చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాయల శ్రీనివాసరావు, సహోపాధ్యాయుడు బడుగు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ప్రారంభం కావడంతో శనివారం మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ గ్రామంలోని రెండు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు కానీ, పాఠశాలలకు కానీ ఏ అవసరాలున్నా తన దృష్టికి తీసుకువస్తే తన పరిధిలో వాటిని తీర్చడానికి కృషి చేస్తానని మూడు స్కూల్స్ హెచ్‌ఎంలకు సూచించారు.

వేగంగా పంట బోదెల తవ్వకం


కేపీ పాలెం సౌత్‌లో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువలు వదలడంతో ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందాలనే ఉద్దేశంతో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. మండలంలోని కెపిపాలెం సౌత్, నార్త్, మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, పడమటిపాలెం తదతర ప్రాంతాలలో గత రెండు రోజులుగా పంటబోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి ఎకరాకు సాగు నీరందంచినట్లుగానే సార్వా సాగుకు ప్రతి శివారు భూములకు నీరందించేందుకు పంటబోదెల తవ్వకం చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

అధ్వానంగా మొగల్తూరు ప్రధాన కాలువ


మొగల్తూరు ప్రధాన కాలువలో పేరుకుపోయి ఎండిపోయిన గుర్రపుడెక్క, చెత్త

మొగల్తూరు: మొగల్తూరు ప్రధాన కాలువ అధ్వానంగా తయారైంది. నిడదవోలు- నరసాపురం ప్రధాన కాలువ మొగల్తూరు వరకు ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే జంతుకళేబరాలు, చెత్తచెదారాలు అన్నీ మొగల్తూరు వరకు వచ్చి నిలిచిపోతాయి. ముఖ్యంగా నరసాపురం మండలం సీతారాంపురం నుంచి మొగల్తూరు లాకు వరుకు పెద్ద ఎత్తున గుర్రపుడెక్క నిలిచి పోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగదు. ప్రధానంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నిలిచి పోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. మొగల్తూరు ప్రధాన కాలువలోని నీరు వేలాది ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు సుమారు 8 గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుస్తుంది. మొగల్తూరు కాలువ నీటిని కేపీ పాలెంలో భారీ మంచి నీటి చెరువును, మొగల్తూరులోని మంచి నీటి చెరువును నింపుతారు. అయితే కాలువ నీరు అధ్వానంగా ఉండటంతో పాటు దుర్వాసన వస్తుండటంతో తాగు నీటి చెరువులను నింపడంలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలో నిలిచిపోయిన గుర్రపుడెక్క, చెత్తచెదారాలను తీసేసి ప్రక్షాళన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ


డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచించారు. శనివారం ఉదయం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నాయకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెగ్యులర్‌గా జరిగే పారిశుద్ధ్య పనులతో పాటుగా ప్రస్తుతం పలు కూడళ్లలో జరుగుతున్న డ్రెయిన్స్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఎక్కడా పారిశుద్ధ్య ఇబ్బందులు రాకూడదన్నారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా పారిశుద్ధ్య పనుల్లో లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, జనసేన పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, CNR అక్వా ఎంటర్‌ప్రైజెస్ మరియు దాని యజమాని శ్రీ జల్లి జయరాజు, S/o గంటయ్య, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, నివాసం : డి.నం.8-194/1, మోడీ గ్రామం, రాళ్ల మండలం, కాలవపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534201 వారు రూ.5,13,46,130/- (అక్షరాల ఐదు కోట్ల పదమూడు లక్షల నలభై ఆరు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే) ... R.Sలో 2069 చదరపు గజాల (501.660 చ.గజాలు + 1677.333 చదరపు గజాలు) ... డి.నం. 29/170-98, ... కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ ... సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నాము.

ఇట్లు,
మెస్సర్స్ వెంకటేష్, అమర్‌నాథ్ & కో.,
న్యాయవాదులు,
నెం.432, 1వ అంతస్తు, 12వ క్రాస్,
సదాశివనగర్, బెంగుళూరు- 560 090
ఫోన్:+ 91-9886140745, + 91-9738129600